నమస్తే తెలంగాణ
ఖమ్మం
10 | ఖమ్మం, శుక్రవారం 11 అక్టోబర్ 2024 | KHAMMAM

ఖమ్మంలో సద్దుల బతుకమ్మను సాగనంపుతున్న యువతులు

బీఆర్ఎస్ ఆఫీసులో బతుకమ్మ వద్ద పూజలు చేస్తున్న అజయ్

పూలపూంతే

ఎంగిలిపూలతో షురువైన బతుకమ్మ సంబురాలు.. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో తొమ్మిది రోజులపాటు సంబురంగా సాగాయి. ఇళ్లలో బతుకమ్మలను పేర్చిన మహిళలు, యువతులు.. వాటిపై గౌరమ్మలను ప్రతిష్ఠించి నియమ నిష్ఠలతో పూజలు చేశారు. సాయంత్రం వేళ బతుకమ్మలతో ఆలయాలు, పాలం గట్ల పరిసరాలకు చేరుకుని ఆడిపాడి సందడి చేశారు. గురువారం చివరి రోజు సద్దుల బతుకమ్మ కోసం తీరొక్క పూలను సేకరించారు. ఇంటిల్లిపాదీ వాటికి రంగులద్ది పండుగకు మరింత శోభను తీసుకొచ్చారు. పోటీపడి బతుకమ్మలను పేర్చిన ఆడబిడ్డలు.. తొలుత తమ ఇళ్లలో పూజలు నిర్వహించారు. సాయంత్రం వేళ నూతన వస్త్రాలు ధరించి మేళ తాళాల నడుమ నిమజ్జన ప్రాంతాలకు చేరుకున్నారు. బతుకమ్మలను చుట్టూ పెట్టి తెలంగాణ సంప్రదాయాలను ప్రతిబింబించేలా బతుకమ్మ పాటలు పాడారు. కోలాటాలు వేస్తూ మురిసిపోయారు. అనంతరం బతుకమ్మలను గంగమ్మ ఒడికి చేర్చారు. వాయినాలు ఇచ్చిపుచ్చుకుని ఇళ్లకు బయలుదేరారు. వెంట తీసుకెళ్లిన నైవేద్యాన్ని పలువురికి పంచిపెట్టి పండుగ ప్రతిష్ఠను ఇనుమడింపజేశారు. కాగా, గురువారం అర్ధరాత్రి వరకూ సద్దుల బతుకమ్మతో ఆడబిడ్డలు సందడి చేశారు. కొత్తగూడెంలో మురేడు, గోధుమవాగు; ఖమ్మంలో మున్నేరు వాగుల వద్ద ఏర్పాటు చేసిన ఘాట్‌లలో నిమజ్జనం చేసి బతుకమ్మలను సాగనంపారు.

- భద్రాద్రి కొత్తగూడెం, నమస్తే తెలంగాణ/ ఖమ్మం, అక్టోబర్ 10

సంస్కృతిని చాటుతూ ముగిసిన సద్దుల బతుకమ్మ

- తీరొక్క పూలతో బతుకమ్మలను తీర్చిదిద్దిన ఆడబిడ్డలు
- గౌరమ్మను ప్రతిష్ఠించి నియమ నిష్ఠలతో పూజలు
- సాయంత్రం ఆటపాటలు, కోలాటాల మధ్య సంబురాలు
- గంగమ్మ ఒడికి చేర్చి వాయినాలు ఇచ్చిపుచ్చుకున్న మహిళలు

సద్దుల బతుకమ్మతో వస్తున్న సింగరేణి మహిళలు

గౌరమ్మను చూపుతున్న మహిళలు

సద్దుల బతుకమ్మలతో మహిళలు

బతుకమ్మలతో వస్తున్న ఆడబిడ్డలు

కొత్తగూడెంలో బతుకమ్మలతో మహిళలు

బతుకమ్మ ఆడుతున్న సింగరేణి మహిళలు

కొత్తగూడెం ప్రకాశం స్టేడియంలో..

ఖమ్మంలో బతుకమ్మకు హారతి పడుతున్న మహిళలు

తెలంగాణ భవన్ వద్ద బతుకమ్మతో మహిళలు

బతుకమ్మ వేడుకల్లో సింగరేణి మహిళలు

ఖమ్మం: దుర్గామాతగా ముస్తాబై వచ్చిన బాలికతో కుటుంబ సభ్యులు

ఖమ్మం 6వ డివిజన్‌లో..

ఖమ్మం బీఆర్ఎస్ కార్యాలయంలో బతుకమ్మ ఆడుతున్న ఆడబిడ్డలు

'పాలేరు' రైతులు రాష్ట్రానికి రాజులవుతారు

- మద్దులపల్లి ఏఎంసీ పాలకవర్గ ప్రమాణ స్వీకార సభలో మంత్రి తుమ్మల
- మరో రూ.13 వేల కోట్ల రుణమాఫీ జరగాల్సి ఉంది: మంత్రి పొంగులేటి

మాట్లాడుతున్న మంత్రి తుమ్మల, చిత్రంలో పొంగులేటి

ఖమ్మం రూరల్, అక్టోబర్ 10: పాలేరు నియోజకవర్గ రైతులు రాష్ట్రానికి రాజులయ్యే అవకాశం ఉందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. మండలంలోని మద్దులపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం మార్కెట్ ప్రాంగణంలో గురువారం జరిగింది. తొలుత జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి ఏఎం అలీం.. నూతన చైర్మన్ బైరు హరి నాథబాబు, వైస్ చైర్మన్ వనవాసం నరేందర్‌రెడ్డి సహా పాలకవర్గ సభ్యులతో ప్రమాణం చేయించారు. అనంతరం జరిగిన సభలో మంత్రి తుమ్మల మాట్లాడారు. కొద్ది రోజుల్లోనే పాలేరుకు గోదావరి జలాలు రాబోతున్నాయన్నారు. రైతులు విరివిగా ఆయిల్‌పామ్ సాగు చేస్తే ఈ ప్రాంతంలో మరో ఫ్యాక్టరీ తీసుకొస్తామన్నారు. మద్దులపల్లి నూతన వ్యవసాయ మార్కెట్‌కు మంచి భవిష్యత్ ఉందన్నారు.

మరో రూ13వేల కోట్ల రుణమాఫీ జరగాలి: పొంగులేటి

మద్దులపల్లి మార్కెట్ నిర్మాణం వచ్చే సంక్రాంతి నాటికి పూర్తయ్యేలా కృషి చేస్తామని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. రూ.18 వేల కోట్లతో రైతుల పంట రుణాలను మాఫీ చేశామని అన్నారు. మరో రూ.13 వేల కోట్లతో రూ.2 లక్షల పైబడిన ఉన్న రుణాలు మాఫీ చేయాల్సి ఉందని అన్నారు. ఈ నెల ఆఖరులోపు ఇందిరమ్మ ఇళ్ల శంకుస్థాపనలు జరుగతాయన్నారు. నూతన రెవెన్యూ చట్టం అమల్లోకి త్వరలో వస్తుందన్నారు. రాష్ట్ర గిడ్డంగుల అభివృద్ధి సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

ముగ్గురున్న కాడ్నే మూడు..!

- భద్రాద్రి జిల్లాకు 'నో' ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్
- ఖమ్మం, మధిర, పాలేరు నియోజకవర్గాల్లో పూర్తయిన స్థల సేకరణ
- 20 నుంచి 25 ఎకరాల్లో క్యాంపస్, బ్లాక్‌ల నిర్మాణం
- వచ్చే విద్యాసంవత్సరం నుంచి తరగతులు ప్రారంభించేలా చర్యలు
- నేడు శంకుస్థాపన చేయనున్న డిప్యూటీ సీఎం, మంత్రులు

శంకుస్థాపన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ శ్రీజ, డీఈవో సోమశేఖర శర్మ

ఖమ్మం, అక్టోబర్ 10 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల మంజూరు విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం వివక్ష చూపుతుందనే విషయం స్పష్టమవుతున్నది. ఉమ్మడి ఖమ్మం జిల్లాకు సమ ప్రాధాన్యం ఇవ్వాల్సి ఉండగా.. ముగ్గురు మంత్రులున్న ఖమ్మం జిల్లాకు.. అదీ పక్క పక్కనే ఉన్న సొంత నియోజకవర్గాలకే మూడు స్కూళ్లను మంజూరు చేయడంపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. విద్యార్థులు ప్రపంచ స్థాయిలో పోటీ పడేందుకు పాఠశాలలు దోహదం చేస్తాయని ప్రభుత్వం చెబుతున్నా.. ఇక్కడ మాత్రం అందుకు విరుద్ధంగా కనిపిస్తున్నది. ఖమ్మం జిల్లాలోని ఐదు నియోజకవర్గాల్లో ఖమ్మం, మధిర, పాలేరుల్లో ఇంటిగ్రేడెట్ స్కూల్స్ ప్రారంభిస్తుండగా, భద్రాద్రి జిల్లాలోని ఐదు నియోజకవర్గాలకు ఒక్క పాఠశాలను కూడా మంజూరు చేయలేదు. ఏజెన్సీ ప్రాంతాన్ని కూడా పరిగణనలోకి తీసుకోవడం లేదంటే వారికి ఆదివాసీలు, గిరిజనులపై ఎంత ప్రేమ ఉందో ఇట్టే అర్థమవుతున్నది.

అన్ని వర్గాల విద్యార్థులకు ఒకేచోట..

అన్ని కులాలు, మతాల విద్యార్థులు ఒకే ప్రాంగణంలలో చదవడం వల్ల వారి మధ్య స్నేహభావంతోపాటు విలువలతో కూడిన సమాజం ఏర్పడుతుందనే ఉద్దేశంతో ప్రభుత్వం ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులకు వారికి కేటాయించిన పద్ధతుల్లో ప్రవేశాలు కల్పించనున్నారు. 6వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు వీటిలోనే విద్య అందించేలా ప్రణాళికలు రూపొందించారు. పాఠశాల ఏర్పాటుకు కనీసం 20 నుంచి 25 ఎకరాల స్థలం ఉండేలా చర్యలు చేపట్టారు. ప్రత్యేకంగా అడ్మినిస్ట్రేషన్ భవనం కోసం ఒక బ్లాక్, తరగతి గదుల కోసం మరో బ్లాక్, వసతి సదుపాయం కోసం ఇంకో బ్లాక్ ఏర్పాటు చేస్తున్నారు. క్యాంపస్‌లో టాయిలెట్ల కోసం ప్రత్యేకంగా వేరొక బ్లాక్ నిర్మించేందుకు ప్రణాళికలు రూపొందించారు. కంప్యూటర్ ఎడ్యుకేషన్, ల్యాబొరేటరీ, క్రీడల కోసం ప్రత్యేకంగా కోర్టులు, ఉపాధ్యాయులకు క్వార్టర్లు నిర్మించనున్నారు.

మూడింటికి నేడు శంకుస్థాపన

ఖమ్మం నియోజకవర్గంలోని రఘునాథపాలెం మండలం జింకలతండా, పాలేరు నియోజకవర్గంలోని ఖమ్మం రూరల్ మండలం పొన్నెకల్, మధిర నియోజకవర్గంలోని బోనకల్ మండలం లక్ష్మీపురంలో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లను ప్రారంభించేందుకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. శుక్రవారం డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డిలు ఈ భవన నిర్మాణాలకు శంకుస్థాపన చేయనున్నారు. డీఈవో సోమశేఖరశర్మ ఆధ్వర్యంలో సెక్టోరల్ అధికారులు, ఎంఈవోలు శంకుస్థాపన కార్యక్రమంలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా సర్వం సిద్ధం చేశారు.

భద్రాద్రి జిల్లాకు ఒక్కటి కూడా లేదాయె..

ఖమ్మం జిల్లాలో మంత్రులున్న నియోజకవర్గాల్లో మాత్రమే ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లను మంజూరు చేయించుకున్నారు. భద్రాద్రి జిల్లాలో కనీసం ఒక్క స్కూల్‌ను కూడా తొలి విడతలో మంజూరు చేయలేదు. విద్యాభివృద్ధి విషయంలో ఏజెన్సీ ప్రాంతమైన భద్రాద్రి జిల్లాకు ఖమ్మం జిల్లాతోపాటు ప్రాధాన్యం ఇవ్వాల్సి ఉండగా.. ప్రభుత్వం ఆ అంశాన్ని పూర్తిగా విస్మరించింది. దీంతో భద్రాద్రి జిల్లావాసులు మంత్రుల తీరుపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. తమ జిల్లాకు కూడా ఇంటిగ్రేటెడ్ స్కూల్‌ను మంజూరు చేయాలనే డిమాండ్ అక్కడి ప్రజాప్రతినిధుల నుంచి వినిపిస్తున్నది.

శంకుస్థాపనకు విద్యార్థులను తరలించాల్సిందే..

ఇంటిగ్రేడెట్ స్కూళ్ల శంకుస్థాపన కార్యక్రమాలకు పాఠశాల విద్యార్థులను తరలించేందుకు విద్యాశాఖ సిద్ధమవుతున్నది. ప్రస్తుతం దసరా సెలవులు ఉన్నప్పటికీ విద్యార్థులను యూనిఫాంలో శంకుస్థాపన ప్రదేశాలకు తీసుకురావాలని అధికారులు విద్యాశాఖకు ఆదేశాలు జారీ చేశారు. ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం ఇలా ఒక్కో ప్రాంతంలో ఒక్కో సమయంలో శంకుస్థాపన కార్యక్రమాలు చేపట్టనున్నారు.

వచ్చే విద్యాసంవత్సరానికి తరగతులు

2025-26 విద్యాసంవత్సరంలో ఇంటిగ్రేటెడ్ స్కూళ్లను ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. వివిధ తరగతుల్లో 2,600 మంది విద్యార్థులు చదువుకునేలా, వీరికి బోధించేందుకు 120 మంది ఉపాధ్యాయులను నియమించనున్నారు. వీరికి ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా ఉండేందుకు అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకుని ఇంజినీరింగ్ అధికారులు ప్రణాళిక రూపొందిస్తున్నట్లు విద్యాశాఖాధికారులు పేర్కొంటున్నారు. ప్రపంచ స్థాయిలో పోటీపడే విధంగా టీచర్ పీపుల్ రేషియో కూడా 1:20 మాత్రమే ఉండి.. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉపాధ్యాయులు అందుబాటులో ఉండే విధానం అమలు చేయనున్నారు.

ఐశ్వర్యలక్ష్మీగా లక్ష్మీతాయారు అమ్మవారు

భద్రాద్రిలో ఏడో రోజుకు చేరిన శరన్నవరాత్రి ఉత్సవాలు

భద్రాచలం, అక్టోబర్ 10: భద్రాచలం సీతారామచంద్రస్వామి ఆలయంలోని లక్ష్మీతాయారు అమ్మవారి ఆలయంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు నేత్రపర్వంగా సాగుతున్నాయి. గురువారం ఏడో రోజు అమ్మవారు ఐశ్వర్యలక్ష్మీ అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ రూపంలో ఉన్న అమ్మవారిని ఆరాధిస్తే శాసకత్వం, వాక్కు ప్రభావం, అనంత ఐశ్వర్యం కలుగుతుందని వేదపండితులు చెబుతున్నారు. సాయంత్రం నిర్వహించిన సామూహిక కుంకుమార్చనకు మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై పూజలు చేశారు. అలాగే చిత్రకూట మండపంలో రామాయణ పారాయణోత్సవాల్లో భాగంగా వేదపండితులు, అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాగా.. లక్ష్మీతాయారు అమ్మవారు శుక్రవారం వీరలక్ష్మీగా భక్తులకు దర్శనమిస్తారు.

17న శబరి స్మృతి యాత్ర

భద్రాచలం, అక్టోబర్ 10: ఈ నెల 17న భద్రాచలం సీతారామచంద్రస్వామి ఆలయంలో శబరి స్మృతి యాత్ర నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో రమాదేవి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 17న ఉదయం 6:30 నుంచి 8:30 గంటల వరకు గిరి ప్రదక్షిణ, చిత్రకూట మండపంలో 8:30 నుంచి 11:30 వరకు నిత్య కల్యాణం, 11:30 నుంచి 12 గంటల వరకు స్వామివారికి వివిధ పుష్ప, ఫలార్చన, మంత్రపుష్పం, ప్రసాద వినియోగం ఉంటుందని పేర్కొన్నారు. ఉదయం 8:30 నుంచి 10 గంటల వరకు స్వామివారి ప్రచార రథంతో వినాయకపురం నుంచి ముత్యాలమ్మ ఆలయం వరకు శోభాయాత్ర, ఉదయం 10:30 నుంచి 12:30 వరకు ముత్యాలమ్మ ఆలయం వద్ద భద్రాచల స్వామివారి ప్రచారమూర్తుల కల్యాణోత్సవం, అన్నప్రసాద వితరణ ఉంటుందని ఈవో వివరించారు.